

# పుస్తక పరిచయం




**తెలుగు** కవితాలోకంతో, ఆర్ట్ సినిమాలతో పరిచయం ఉన్న వాళ్ళకి వారాల ఆనంద్‌గారిని మళ్ళీ పరిచయం చేయాల్సిన అవసరం లేదు. సినిమానూ, సాహిత్యాన్నీ అమితంగా ప్రేమించే ఆనంద్‌గారు రెండు రంగాల్లోనూ విశేషమైన కృషిచేశారు, చేస్తున్నారు. సినిమాల మీద వీరు వ్రాసిన వ్యాసాలు సినీ కౌముదిలో కూడా సీరియల్‌గా వచ్చాయి. తను కృషిచేసే రంగాలపై విశేషమైన పరిశీలనతో పుస్తకాలూ ప్రచురించారు. మృదుభాషి, సౌమ్యశీలి ఐన ఆనంద్‌గారు స్నేహానికి ప్రాణమిచ్చే నేస్తం అని వారితో సన్నిహితంగా మెలిగిన వారందరికీ తెలుసు. నిత్య చైతన్యంతో పనిచేసే అలాంటి వ్యక్తి జీవితంలో హఠాత్తుగా ఒక బలీయమైన కుదుపు, మెడమీద కత్తిలాంటి సంఘటన జరిగింది. హఠాత్తుగా రెండు మూత్రపిండాలూ పనిచేయడంలేదని చెప్పారు వైద్యులు. సన్నని కత్తి అంచుమీద నడుస్తున్న అనుభవాన్నిచ్చే ఆ క్లిష్టసమయంలో - మనసులోని భావాలకి ఆయన ఇచ్చిన కవిత్వరూపమే ఈ కవితా సంపుటి. నిజానికి అలాంటి సమయంలో ఆందోళనా, ఆతృత, విషాదం, విచారం అన్నీ కలగలిసి , అనిశ్చితమైన భవిష్యత్తు గురించి దిగులు మేఘాలు కమ్ముకోవాలి. కానీ ఆనంద్‌గారు అలా చేయలేదు. అలాంటి కుదుపు వచ్చినప్పుడు ఎంత నిబ్బరంగా, నిటారుగా ఉండాలో ఆచరించి, నిరూపించిన ధైర్యశీలి. తన చుట్టూ పేరుకున్న సందిగ్ధతని కవిత్వీకరించారు. కరుగుతున్న క్షణాలను, భారంగా కదులుతున్న కాలాన్నీ కవిత్వంతో అలంకరించారు. ఆసుపత్రిగదిలోంచి వెలువడిన ఈ కవితల్లో ప్రతిదీ మనసుని కదిలించేదే. ఎన్నో జీవన సత్యాలని సున్నితంగా , సరళమైన భావాల్లో, అలతి అలతి పదాల్లో అందించారు. "కదలడానికి చేతులూ / నడవడానికి కాళ్ళూ / ఏడిచేందుకు కళ్ళు.. అన్నీ / ఇసుకపొరల కింద కమ్మేసినట్టు / ఇనుపచెరల కింద బందీ ఐనట్టు " ఉన్న అప్పటి స్థితిని ఇప్పటికీ కళ్ళకి కట్టినట్లు కవితా పంక్తుల్లో బంధించారు. "మాటల పరిమళాల్ని వెదజల్లుతూ / అతనొస్తాడు / నా ముఖం వికసిస్తుంది / విలువల గంపని / నా ముందు బోర్లిస్తాడు/ గదంతా పరిమళ భరితమౌతుంది" అని పలకరించడానికి వచ్చిన మిత్రుల్నీ ఈ కవిత్వంలో ఒక భాగం చేశారు. అప్పుడే అర్థం ఐనట్లున్న వాళ్ళబ్బాయి గురించి "నా కలలూ నీ కలలూ / ప్రోదిచేసుకుని విశ్వంలోకి దూసుకెళ్ళు / నిన్ను అందరూ అర్థం చేసుకుంటారు" అనీ చెప్పారు. తన మనసులోని భావాలతో మన మనసులోకి ప్రవహించారు ఆనంద్‌గారు ఈ కవితల రూపంలో.(ఆనంద్‌గారి శ్రీమతి ఇందిరగారు తన మూత్రపిండాన్ని దానం చేసి ఆయనలో ఒక భాగమై నిలిచారు. ప్రస్తుతం సంపూర్ణారోగ్యంతో తన కార్యక్రమాలని కొనసాగిస్తున్నారు వారాల ఆనంద్‌గారు) ★★★

***For Copies:***

**V. INDIRA RANI**
H.No. 8-4-641, Hanuman Nagar
Karimnagar - 505 001.
Cell : 9440501281.
and
All leading Book Selle




**మనిషి** ఎలా జీవించినా, ఎంత కాలం జీవించినా - అన్నీ అంతమయ్యే క్షణం ఒకటుంటుంది. అది జీవితానికి ఫుల్ స్టాప్. జీవితప్రయాణం ముగిసిన క్షణం.. మనిషి ఉనికి మాయమై పోతుంది. ఊపిరి ఆగిపోతుంది. బయట వీచే గాలి శ్వాసకోశంలోకి వెళ్ళి ఊపిరిగా మారే క్షణం ముగిసిన సమయంలో అది ఊపిరికాదు, కేవలం గాలి మాత్రమే! అదే "When breath becomes air". ఈ 225 పేజీల పుస్తకం - 36 సంవత్సరాల న్యూరో సర్జన్ రెండేళ్ళపాటు మృత్యువుతో చేసిన సహజీవనం, తరుముకొస్తున్న మరణభావనతో కలిసి చేసిన ప్రయాణం. చాలామందికి మరణం అంటే A point of time- కానీ అసాధారణమైన మేధస్సు, ప్రతిభ, ప్రజ్ఞ ఉన్న ఈ డాక్టర్‌కి death became a process. పది సంవత్సరాల న్యూరో సర్జరీ చదువునీ, శిక్షణనీ, రెసిడెన్సీని పూర్తిచేసుకుని మరికొద్ది నెలల్లో పూర్తిస్థాయి వైద్యుడిగా కొనసాగాల్సిన సమయంలో హఠాత్తుగా బయటపడింది ఊపిరితిత్తుల కేన్సర్. రోగుల సేవలో జీవితానికో అర్థాన్నీ, పరమార్థాన్నీ కల్పించుకోవాలని ఆ దిశలో ప్రయాణిస్తున్న సమయంలో హఠాత్తుగా మృత్యువు పంజా విసిరితే మనిషి స్థితి ఎలా ఉంటుంది? మిగిలిన సమయంలో ఏమి చెయ్యాలనిపిస్తుంది? అలాంటి స్థితిలో ఉన్న డాక్టర్ పాల్ కళానిధి వ్రాసుకున ఆత్మకథ ఈ పుస్తకం. ఇంక జీవితకాలం ఒక ఏడాదో, రెండేళ్ళో మాత్రమే అని తెలిసినపుడు - దిగులుపడుతూ కూర్చోవాలా? అన్నీ మరిచిపోయి తీరని కోరికలని తీర్చుకునే ప్రయత్నాలు చేయాలా? అలా కాకుండా క్వాలిటీ ఆఫ్ లైఫ్‌ని నిర్వచించుకుని ఆ రెండేళ్ళలో పాల్ కళానిధి జీవితాన్ని గడిపిన వైనం - అదే ఈ పుస్తకం. ఈ పుస్తకం నిండా కనిపించేది ఆయన పోరాట పటిమ, స్ఫూర్తిదాయకమైన చివరిరోజులు..! బహుశా కేన్సర్ బారిన పడకుండా బ్రతికి ఉంటే పాల్ కళానిధి కొన్ని లక్షలమంది ప్రాణాలని కాపాడి ఉండేవాడేమో! ఐతే అంత చిన్న వయసులోనే మరణించినా, మరణించాక ప్రపంచానికి తెల్పిన తన ఈ పుస్తకంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిలియన్లమంది హృదయాలని స్పృశిస్తున్నారు., జీవితాలను ప్రభావితం చేస్తున్నారు. క్రిందటి సంవత్సరమే విడుదలైనా ఈ పుస్తకం New York Times best seller నిలవడమే కాక అనేక భాషల్లోకి తర్జుమా చేయబడింది. ఈ పుస్తకం చదివాక గుండెబరువెక్కకుండా ఉండడం అసాధ్యం, కళ్ళు తడి కాకుండా ఉండడం అసంభవం. ఈ పుస్తకం గురించి New York Times వ్రాసిన కామెంట్ - Finishing this book and then forgetting about it is simply not an option!! ఈ ఒక్క వాక్యం చాలు, ఈ పుస్తకం కలిగించే ప్రభావం ఎలాంటిదో తెలియచేయడానికి!! ★★★

**Published by:**
*Random House*
*randomhousebooks.com*

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**